క్లుప్తంగా

వైభవంగా ధనుర్మాసోత్సవాలు



గుండుగొలను వేంకటేశ్వర స్వామికి గ్రామోత్సవం

భీమడోలు: గుండుగొలనులో వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మాజీ ఉపసర్పంచ్ మామిళ్లపల్లి కాశీబాబు ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం భోగి పూజలను ఆలయంలో ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని రాష్ట్ర ఇరిగేషన్ అడిషనల్ కార్యదర్శి మామిళ్లపల్లి కాశీకుమార్ కుటుంబ సభ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం గ్రామంలో స్వామి వారు గరుడ వాహనంలో వీధుల్లోఊరేగారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం



ఉంగుటూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఉంగుటూరు శివాలయం ప్రాంగణంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా దేవి కల్యాణం నిర్వహించారు. కొత్త పుల్లేశ్వరరావు దంపతులు, విద్యుత్ ఏఈ శ్రీరామ్ దంపతుల, తదితరులు కల్యాణ క్రతువును జరిపించారు.

భక్తిశ్రద్ధలతో శివ ముక్కోటి పూజలు



గుండుగొలనులో శివునికి విశేష అలంకరణ

భీమడోలు: భీమడోలు, గుండుగొలను, అంబర్‌పేట, పోలసానిపల్లిలో సోమవారం భోగి పండుగ సందర్భంగా ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శివ ముక్కోటి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి రోజున ఎంత ఫలితం ఉంటుందో అదే ఫలితాన్ని శివ ముక్కోటి నాడు ప్రాప్తిస్తుందని భక్తుల విశ్వాసం. గుండుగొలనులోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో శివ ముక్కోటిని పురస్కరించుకుని ఆలయ పూజారి లంకా శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని విశేషంగా అలంకరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పెదపాడులోని వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణం పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పెదపాడు: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో మకర సంక్రాంతిని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు చేసారు. ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాలను స్వామికి సమర్పించారు. స్వామి కల్యాణం నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలోని భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామ వీధుల్లో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.

ఎంపీటీసీ చాంబర్ అధ్యక్షుడు నాగరాజుకు పితృ వియోగం

ఉంగుటూరు: ఎంపీటీసీ చాంబర్ మండల అధ్యక్షుడు బండారు నాగరాజు తండ్రి వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త బండారు కన్నయ్య (87) సోమవారం కన్నుమూశారు. బండారు నాగరాజు నారాయణపురం ఎంపీటీసీగా ప్రాతినిథ్యం వహిస్తున్నారు. కన్నయ్య గుండె సమస్యకు మందులు పాడుతున్నారు. ఈనేపథ్యంలో సోమవారం ఆయన కన్నుమూశారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2.15 లక్షల విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు సోమవారం వేర్వేరుగా రూ. 2,15,255 విరాళంగా అందజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన ఎస్వీఎస్ఎన్ ప్రకాష్ రూ.1,04,139, గన్నవరానికి చెందిన సీహెచ్ శివరామకృష్ణప్రసాద్ రూ.1,11,116 ఆలయ కార్యాలయంలో జమ చేశారు.

గ్రామాల్లో యథేచ్ఛగా కోడి పందేలు

- పోలీస్ హెచ్చరికలు బేఖాతర్
- ప్రతి బరిలో లక్షల్లో బెట్టింగులు
- కూటమి నాయకులు కనుసన్నల్లో పందేలు, జూదక్రీడలు
- మూడు రోజుల జాతరకు తెరలేపిన నిర్వాహకులు



గణపవరంలో తలపడుతున్న పందెం పుంజులు



గుండుగొలనులో కోడికి కత్తి కడుతున్న దృశ్యం



పందాల బరుల వద్ద గుండాట



గుండుగొలనులో నంబర్స్ ఆడుతున్న యువకులు

భీమడోలు: కోడిపందేల నిర్వహణపై పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎన్ని హెచ్చరికలు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. అనుకున్నట్టుగానే పండుగ మూడురోజుల పాటు కోడిపందేలు కొనసాగించేందుకు ఏర్పాట్లు చేశారు. పండుగ మొదటిరోజైన భోగి నాడు సోమవారం గిరిజన ప్రాంతంలో యథేచ్ఛగా కోడిపందేలు ప్రారంభమయ్యాయి. కోడిపందేల మాటున జూద క్రీడలు, మద్యం విక్రయాలు భారీగా సాగాయి. బరుల వద్ద భారీగా గుండాట, కోత ముక్కల ఆట ఏర్పాటు చేశారు. పందేలకు వచ్చిన వారికోసం బరి వద్ద పలావులు, చికెన్ పకోడి వంటి దుకాణాలు ఏర్పాటు చేశారు. ఒక్కో పందెంలో లక్షల రూపాయలు చేతులు మారాయి.పందేలు నిర్వహిస్తున్న ప్రాంతాలు జాతరను తలపించాయి. స్థానికులతోపాటు ఇతర జిల్లాల నుంచి పలువురు వేలాదిగా తరలివచ్చి పందేలను తిలకించారు.

భీమడోలు మండలంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకే కోడి పందేలకు తెరతీసారు. మూడు రోజుల కోడి పందేలు కూటమి నాయకుల కనుసన్నల్లో యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, అంబర్‌పేట, సూరప్పగూడెం, కొల్లేరు గ్రామాల్లో గతం కన్నా ఎక్కువగా కోడి పందేలతో పాటు పేకాట శిబిరాలు ఏర్పాటు చేసుకుని రాత్రి పగలు తేడా లేకుండా సాగిస్తున్నారు. గ్రామాల్లో మద్యం ఏరులై పారింది. గుండుగొలను గణేష్‌నగర్ వద్ద కూటమి నాయకులు ఏర్పాటు చేసిన భారీ బరిలో ప్రతి పందెం రూ.20వేల నుంచి రూ.50వేల వరకు పలికింది. జిల్లా నలుమూలల నుంచి భారీగా పందెంగాళ్లు తరలి వచ్చారు. దీనితో కార్లు, మోటార్ బైక్‌లు రోడ్డుపై బారులు తీరారు.

జోరుగా జూదాలు

గణపవరం: సంక్రాంతి కోడి పందేలు అడ్డూ అదుపూ లేకుండా సాగుతున్నాయి. కోడిపందాలలో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు చేతులు మారుతున్నాయి. పదివేల నుంచి లక్ష రూపాయల వరకూ పందేలు కాస్తున్నారు. గణపవరం మండలంలోని చినరామచంద్రపురం, గొల్లలదిబ్బ, ముగ్గళ్ల, అర్ధవరం, అప్పనపేట, చిలకంపాడు, మొయ్యేరు, కొందేపాడులో కోడి పందేలు జోరుగా సాగాయి. పందేల వద్ద జూదం కూడా యథేచ్ఛగా సాగుతోంది. నంబరాట, ఎరుపు, నలుపు, కోతాట, గుండాట వంటివి జోరుగా సాగుతున్నాయి. గణపవరంలో కొందరు యువతులు నంబరాట ఆడి సొమ్ములు పోగొట్టుకున్నారు.

కోడిపందేలకు బరి తెగించారు

నిడమర్రు: సంక్రాంతి పండుగ ముసుగులో కూటమి నేతల కనుసన్నల్లో కోడి పందేలు, పేకాట, గుండాటలు మంగళవారం జోరుగా ప్రారంభమయ్యాయి. ప్రధానంగా పత్తేపురం బరిలో లక్షల్లో నగదు చేతులు మారింది. ఉదయం 8 గంటలకే అన్ని చోట్ల కోడి పందేలు ఇతర జూదాలు ప్రారంభమయ్యాయి. పత్తేపురంతోపాటు బావాయిపాలెం, తోకలపల్లి, చానమిల్లి, పెదనిండ్రకొలను, అడవికొలనులో కోడిపందేల బరులు నిర్వహించారు. ఆయా కోడి పందాల బరుల వద్ద కోడి మాంసం, మేక మాసం పకోడి, బిర్యాని, డ్రిక్స్ వంటి దుకాణాలు ఏర్పాటు చేశారు.



నారాయణపురంలో కోడి పందేల బరిని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ



నువ్వానేనా అని తలపడుతున్న పందెం పుంజులు

దెందులూరు మండలంలో..

దెందులూరు: మండలంలో సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు పేకాట ప్రారంభమయ్యాయి. సీతంపేట, గుండుగొలను, శింగవరం, మేధినరావుపాలెం, శ్రీరామవరం, గంగన్నగూడెం గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించారు.

జోరుగా కోడిపందేలు

పెదవేగి : మండలంలో కోడి పందేలు జోరుగాసాగాయి. సోమవారం మొదలైన కోడి పందేలు వరుసగా మూడు రోజులు కొనసాగే అవకాశం ఉంది. పందేల బరి సమీపంలో మద్యం ఏరులై పారుతోంది. ప్రధానంగా రామశింగవరం, న్యాయంపల్లి, వేగివాడ, దిబ్బగూడెం–లక్ష్మీపురం, విజయరాయి, బాపిరాజుగూడెం, దుగ్గిరాల, పెదకడిమి తదితర గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దుగ్గిరాల జాతీయ రహదారి సమీపంలోని పందేల్లో పాల్గొన్నారు.

కత్తులు దూసిన కోడి పుంజులు

ఉంగుటూరు: కోడి పందేలు ఉంగుటూరు మండలంలో యథేచ్ఛగా జరిగాయి. కూటమి పెద్దలు కనుసన్నల్లో పందేలు జోరుగా సాగాయి. నారాయణపురంలో నాలుగుచోట్లు పందేలు నిర్వహించారు. నారాయణపురంలో కోడి పందేలను జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రారంభించారు. బాదంపూడి, కైకరం, గొల్లగూడెం, చిన్న వెల్లమిల్లి, కొత్త ఉంగుటూరు, బాదంపూడి, రాచూరులో బరులు నిర్వహించారు.



గుండుగొలనులో పేకాట ఆడుతున్న దృశ్యం



దుగ్గిరాలలో ఎమ్మెల్యే ప్రభాకర్ బరి వద్ద కోడి పందేలు

కూటమి ప్రభుత్వం నమ్మక ద్రోహం



అప్పనపేటలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేస్తున్న సీపీఎం నాయకులు

గణపవరం: విద్యుత్ బిల్లుల పెంపుపై గతంలో నిప్పులు చెరిగిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చిన ఆరునెల్లోనే వినియోగదారులకు విద్యుత్ బిల్లులు షాక్ తగిలేలా పెంచేశారని గణపవరం మండల సీపీఎం నాయకులు విమర్శించారు. సోమవారం గణపవరం మండలం అప్పనపేటలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలు భారీగా వచ్చిన విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేసి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెంచిన విద్యుత్ బిల్లులను తక్షణం తగ్గించాలని, అధికారంలోకి వస్తే ఐదేళ్లు విద్యుత్ చార్జీలు పెంచనని ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా నాయకుడు జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించి, అధికారంలోకి రాగానే వాటిని ఏర్పాటు చేయడాన్ని ఏమనుకోవాలని ప్రశ్నించారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రభుత్వం ఉపసంహరించుకునే వరకూ సీపీఎం ప్రజల తరపున ఆందోళనలు నిర్వహిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి పి నర్సింహమూర్తి, ఎస్.రామకృష్ణ, పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ర్యాంకర్‌కు మానవత ఆర్థిక సాయం



రూ.20 వేల చెక్కును అందజేస్తున్న మానవత మండల అధ్యక్షుడు రంగరాజు

ఉంగుటూరు: నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో టాపర్‌గా నిలవడమే కాక అత్యధిక మార్కులు సాధించి రాష్ట్రంలో ద్వితీయస్థానంలో నిలిచిన కైకరానికి చెందిన హనుమంతు అజయరాజ్‌కు మానవత సంస్థ రూ.20వేల చెక్కును సోమ వారం అందజేశారు. మానవత సంస్థ అధ్యక్షుడు వేగేశ్న రంగరాజు చేతులు మీదుగా ఈ చెక్కును అందించారు. అజయరాజు తండ్రి రంగారావును శాలు వా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా మానవత రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి మాట్లాడుతూ అజయరాజ్ భవిష్యత్తులో బాగా చదువుకుని ఉన్నత స్థానానికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానవత మండల అధ్యక్షుడు వేగేశ్న రంగరాజు, కార్యదర్శి గంజి రవి, మాజీ ఏఎంసీ చైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, గోపినాథపట్నం సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి, శీతాల సత్యనారాయణ కోనే సత్యనారాయణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అన్ని విధాలుగా చేటు

భీమడోలు: బాల్య వివా హాలు అన్ని విధాలుగా చేటు అని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం ఆనంద్, రాజా, ఆంజనేయులు అన్నారు. భీమడోలులో సోమవా రం చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ (క్రాఫ్) ఆధ్వర్యంలో బాల్య వివాహ నిరోధంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. మన గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దుకుందామంటూ వారంతా ర్యాలీ, ప్రదర్శన చేసారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే చట్టా రీత్యా నేరమని, వారంతా శిక్షార్హులని, ఎంతటి వారైనా చట్ట పరిధిలో ఉంటారన్నారు. కనీసం ఆడపిల్లకు 18 ఏళ్లు, మగ వారికి 21 ఏళ్లు నిండాలన్నారు. బాల్య వివాహాలను నిలుపుదల చేయడం మనందరి బాధ్యత అన్నారు. బాల్య వివాహాలు జరిగితే 112, 1098కు ఫోన్ చేయాలని సూచించారు.జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు మనమంతా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్, క్రాఫ్ సీఎస్‌డబ్ల్యూ కె.రామలక్ష్మి, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబరాన్నంటిన భోగి వేడుకలు



భీమడోలులో భోగి మంట వేసిన దృశ్యం



పెదవేగి : దెందులూరులో భోగిమంటలు వేస్తున్న దృశ్యం

- వాడవాడలా సంక్రాంతి సందడి
- వీధుల కూడళ్లలో భోగి మంటలు
- ఉత్సాహంగా సందడి చేసిన యువత

భీమడోలు: గ్రామాల్లో భోగి వేడుకలు అంబరాన్నంటాయి. సోమవారం తెల్లవారుజామునుంచి కూడలి ప్రాంతాలు, ఇళ్ల వద్ద, ప్రభుత్వ కార్యాలయాల వద్ద భోగి మంటలు వేసారు. ఇళ్లలోని పాత సామగ్రి, వస్తువులను తీసుకుని వెళ్లి మంటల్లో తగులబెట్టారు. భీమడోలు సంతమార్కెట్ వద్ద పారిశుద్ధ్య కార్మికులు ముగ్గులు వేసి ఆ తర్వాత భోగి మంట వేసారు. భోగిమంట చుట్టూ వారంతా తిరుగుతూ నృత్యాలు చేసారు. సంక్రాంతి సంబరాల్లో భోగి పడుగను వాడవాడలా జరుపుకున్నారు. గృహాల్లో భోగి పూజలు చేసారు. చిన్నారులకు భోగి పండ్లను వేసారు. ప్రతి ఇంటిలో భోగి పండుగ సంతోషంగా జరుపుకున్నారు.





పెదవేగి : చిన్నారులకు భోగిపండ్లు వేస్తున్న పెద్దలు, పిండి వంటలు చేస్తున్న మహిళలు

గ్రామాల్లో భోగి సందడి

పెదవేగి : వాడవాడలా భోగి పండుగను ప్రజలు అట్టహాసంగా నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి బంధువులు ఇళ్లకు చేరుకోవడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. భోగి పండుగను పురస్కరించుకుని పలు గ్రామాల్లో చిన్నారులకు భోగిపండ్లు పోసి సంపూర్ణ ఆరోగ్యంతో చిరంజీవిగా జీవించాలని కోరుతూ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సత్యనారాయణశర్మ భోగిపండ్ల విశిష్టతను తెలియజేశారు.ఈ సందర్భంగా వారంతా కలసి పిండి వంటలు, చేయడం జడలు వేసుకోవడం, భోగి మంటలు, ముగ్గులు వేయడం లాంటివి చేసి ఆనందంగా గడిపారు.

పేద వృద్ధులకు నగదు సహాయం అందజేత

గణపవరం: సంక్రాంతి సందర్భంగా సామాజిక సేవకుడు కొలనువాడ సుబ్బరాజు సోమవారం గ్రామంలోని పేద వృద్ధులకు నగదు సహాయం అందజేశారు.కొన్నేళ్లుగా ఏటా భోగి పండుగ రోజున గ్రామంలోని సుమారు 60 మంది పేద వృద్ధులకు నగదు సహాయం అందజేస్తున్నారు. ఈ సంవత్సరం కూడా పిప్పరలోని శివాలయం వద్ద వృద్ధులకు పండ్లు, నగదు సహాయం అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కొలనువాడ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

ఉత్సాహంగా రంగవల్లుల పోటీ



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

దెందులూరు: సీతంపేటలో విఘ్నేశ్వర స్వామి ఆలయంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ అధికారి నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీ నిర్వహించారు. విజేతలకు గ్రామ వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఎరువుల డీలర్ కోటిపల్లి సత్తిరాజు, సొసైటీ డైరెక్టర్ ఉదయభాస్కర్ చేతులు మీదుగా బహుమతులు అందజేసినట్టు నరేంద్రరెడ్డి తెలిపారు.

రైతుల ఇంట సిరుల పండుగ సంక్రాంతి



కొవ్వలిలో గ్రామదీప్ ఆధ్వర్యంలో వేసిన భోగి మంట



దెందులూరు మండలం కొవ్వలిలో బొమ్మల కొలువు

సంక్రాంతి పండుగ అంటే రైతుల ఇంట సిరుల పండుగ సార్వా పంట పూర్తయ్యి ధాన్యం ఇంటికి చేరిన తరువాత వచ్చే మొదటి పండుగ సంక్రాంతి. దెందులూరు మండలం కొవ్వలిలో సంక్రాంతి సందర్భంగా గ్రామదీప్ ఆధ్వర్యంలో భోగి పండుగ సంబరాలు ఆనందోత్సవాల నడుమ ఘనంగా నిర్వహించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



రోకలి పట్టిన మహిళలు